సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 18 । జూలై । 2025



టన్ను చీనీ రూ.18 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టం రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



'తమ్ముడి' దౌర్జన్యం
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. అమాయకుల భూములతో పాటు ప్రభుత్వ స్థలాలనూ కబ్జా చేస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.5°/21.8°
జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

20న ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న జిల్లా ఫుట్‌బాల్ సీనియర్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఆదివారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. 2009 డిసెంబర్ 31వ తేదీ లోపు జన్మించిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు అసోసియేషన్ కార్యదర్శి బీకే మహమ్మద్ సలీమ్ సెల్ నంబర్ 80995 98958కు సంప్రదించాలని సూచించారు.

తిరుపతి - చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి– చర్లపల్లి మధ్య ఆగస్టు 3 నుంచి 25 వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి జంక్షన్ నుంచి (07481) ఆగస్టు 3వ తేదీ రైలు బయలుదేరుతుందన్నారు. తిరిగి చర్లపల్లి జంక్షన్ నుంచి (07482) 4వ తేదీ సోమవారం ప్రారంభమవుతుందన్నారు. రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిప్రతి, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. స్పెషల్ రైళ్లలో 3టైర్ ఏసీ మాత్రమే ఉంటుందన్నారు.

14 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లాలోని 14 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. కొన్ని చోట్ల జల్లులు కురిశాయి. అత్యధికంగా పెనుకొండలో 21.4 మి.మీటర్లు, గోరంట్లలో 17.2 మి.మీ వర్షం కురిసింది. అలాగే రొద్దంలో 9.8, కొత్తచెరువులో 9.2, ధర్మవరంలో 5.8, పుట్టపర్తిలో 5.4, సోమందేపల్లిలో 5.4, చిలమత్తూరులో 3.8, రామగిరిలో 2.6, అమరాపురంలో 2.4, ఓడీసీలో 2.4, బత్తలపల్లిలో 2.2, సీకే పల్లిలో 1.6, బుక్కపట్నంలో 1 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో మరో నాలుగు రోజులు వర్షాలు కురవచ్చని పేర్కొన్నారు.

ఇంటి నుంచే తపాలా సేవలు



హిందూపురం: అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0తో ఇకపై వివిధ రకాల పోస్టల్ సేవలను ఇంటి నుంచే సెల్‌ఫోన్ ద్వారా పొందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయకుమార్ తెలిపారు. గురువారం డివిజనల్ ఆఫీసులో ఆయన విలేకరులతో మాట్లాడారు. అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీని ఈ నెల 22 నుంచి హిందుపురం డివిజన్ పరిధిలోని 472 పోస్ట్ ఆఫీసుల్లో అమలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సేవలను ప్రారంభించేందుకు వీలుగా ఈ నెల 21న డివిజన్ పరిధిలోని పోస్టు ఆఫీసులలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించబోమన్నారు. ఆ రోజు అన్ని రకాల సేవలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వేగవంతమైన సర్వీస్ డెలివరీ, కస్టమర్లకు స్నేహపూర్వక సేవలు అందించేందుకు చర్యలు చేపడుతునట్లు పేర్కొన్నారు. పెరిగిపోతున్న సాంకేతికత పరిజ్ఞానానికి అనుగుణంగా పోస్టల్‌శాఖ కూడా మార్పుచెందుతోందన్నారు.

సాగు కృష్ణార్పణం

- ఎంబీసీ పరిధిలోని 265 చెరువులకు కృష్ణాజలాలు విడుదల చేస్తామని మంత్రి సవిత, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు గొప్పలు
- కంటితుడుపుగా కేవలం 46 చెరువులకే నీళ్లు
- సాగునీరు లేక అందక రైతుల గగ్గోలు
- వైఎస్ జగన్ హయాంలో వరుసగా మూడేళ్లు కృష్ణా జలాలు



మడకశిరలో నిరుపయోగంగా ఉన్న హంద్రీనీవా కాలువ

ఎంబీసీ పరిధిలోని చెరువుల సంఖ్య	265
చెరువులన్నీ నింపేందుకు అవసరమైన నీరు	5 టీఎంసీలు
కృష్ణా జలాలు అందని చెరువులు	219
మడకశిర నియోజకవర్గంలో కృష్ణా జలాలు అందని చెరువులు	142

మడకశిర: జిల్లాలోని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ (హంద్రీనీవా సుజల స్రవంతి) మడకశిర బ్రాంచ్ కెనాల్ పరిధిలోని రైతులకు కృష్ణా జలాలు అందక గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పూర్తి స్థాయిలో కృష్ణా జలాలను అందించకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మడకశిర బ్రాంచ్ కెనాల్ పరిధిలో పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ మూడు నియోజకవర్గాల్లో 265 చెరువులు ఉన్నాయి. ఈ చెరువులన్నీ కృష్ణా జలాలతో నింపి సాగునీరు అందించాల్సిన కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని రైతులు మండిపడుతున్నారు.

తూతూ మంత్రంగా కృష్ణా జలాలు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. మడకశిర నియోజకవర్గంలో మొత్తం 165 చెరువులున్నాయి. అందులో కేవలం 23 చెరువులకు మాత్రమే కృష్ణా జలాలను విడుదల చేశారు. పెనుకొండ నియోజకవర్గంలో 19 చెరువులకు, హిందూపురం నియోజకవర్గంలో 4 చెరువులకు మాత్రమే కూటమి ప్రభుత్వం కృష్ణా జలాలను విడుదల చేసింది. మూడు నియోజకవర్గాల్లోని 219 చెరువులకు కృష్ణా జలాలు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

గతమెంతో ఘనం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో మడకశిరకు క్రమం తప్పకుండా కృష్ణా జలాలు వచ్చాయి. 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మడకశిర మండలంలో కృష్ణా జలాలు పారాయి. ఆ తర్వాత వరుసగా రెండేళ్ల పాటు మడకశిరకు కృష్ణా జలాలు రావడం విశేషం. అలాగే మడకశిర చెరువును రెండుసార్లు నింపిన ఘనత కూడా వైఎస్ జగన్‌కే దక్కుతుంది. అయితే కూటమి ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చింది. మొదటి ఏడాది కూడా కృష్ణా జలాలు రాలేదు. ప్రస్తుత ఏడాది కూడా కృష్ణా జలాలను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది.

అటకెక్కిన బైపాస్ కెనాల్..

మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులకు కృష్ణా జలాలను అందించడానికి వీలుగా వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఇందుకు కోసం రూ.214.85 కోట్ల నిధులను కూడా మంజూరు చేసి టెండర్లను కూడా పూర్తి చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ కెనాల్ పనులను చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తోంది. బైపాస్ కెనాల్‌ను అటకెక్కించారని రైతులు మండిపడుతున్నారు.

హడావుడికే పరిమితమైన నేతలు..

మడకశిర నియోజకవర్గానికి కృష్ణా జలాలు వచ్చేశాయంటూ ప్రారంభంలో కూటమి నేతలు హడావుడి చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఒక అడుగు ముందుకేసి కూటమి నేతలను వెంటేసుకుని హంద్రీనీవా కాలువలను పరిశీలించారు. మంత్రి సవిత, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కృష్ణా జలాలతో చెరువులను సస్యశ్యామలం చేస్తామని గొప్పలు చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా కృష్ణా జలాలు రాకపోవడంతో రైతులు కూటమి నేతల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఇది అగళి మండలంలోని కోడిపల్లి చెరువు. వర్షాకాలంలోనూ నీరులేక ఇలా వెలవెలబోతోంది. ఈ చెరువుపై ఆధారపడి దాదాపు 180 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. దాదాపు 200 ఎకరాల ఆయకట్టు ఉంది. సరైన వర్షాలు రాకపోవడంతో ఈచెరువులోకి ఇంత వరకు నీరు చేరలేదు. దీంతో రైతులు కృష్ణాజలాలపై ఆశలు పెట్టుకున్నారు. ఈ చెరువుకే గాక అగళి మండలంలోని మిగిలిన చెరువులకు కూడా కృష్ణా జలాలు రావాలంటే హంద్రీనీవా అగళి మైనర్ కాలువను పూర్తి చేయాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం ఇంత వరకు కాలువను పూర్తి చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.



ఇది అగళి మండలంలోని హంద్రీనీవా మైనర్ కాలువ. ప్రస్తుతం ఈ కాలువ నిరుపయోగంగా మారింది. కృష్ణా జలాలు పారక పోవడంతో కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. అమరాపురం, అగళి మైనర్ కాలువ పనులను పూర్తి చేయడానికి వైఎస్ జగన్ హయాంలో రూ.69.90 కోట్ల నిధుల విడుదలకు రంగం సిద్ధమైంది. అంతలోనే ప్రభుత్వం మారడంతో ఈ కాలువల పనులకు నిధులు విడుదల ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం పనులను చేపట్టకపోవడం రైతులకు శాపంగా మారింది. పంటలు సాగుకు నీళ్లు లేకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.

కృష్ణా జలాలు విడుదల చేయాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. అయితే ఇంత వరకు మడకశిరకు కృష్ణా జలాలు అందించలేదు. వైఎస్ జగన్ హయాంలో మడకశిరకు వరుసగా మూడేళ్లు కృష్ణా జలాలు రావడంతో రైతులకు ఊరట లభించింది. కృష్ణా జలాలు అందించి రైతులను ఆదుకోవాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేదు. ఇప్పటికైనా కూటమి నేతలు స్పందించాలి.

– ఆనందరంగారెడ్డి, పట్టు రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మడకశిర

రైతులను మోసం చేశారు



మడకశిరకు సాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మడకశిరకు కృష్ణా జలాలు వచ్చేశాయంటూ ప్రారంభంలో కూటమి నేతలు హడావుడి చేసి ప్రస్తుతం చేతులెత్తేయడం రైతులను మోసం చేయడమే. గతంలో మడకశిర చెరువును రెండుసార్లు నింపిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కింది.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

సాగునీటికి ఇబ్బంది పడుతున్నాం



ప్రస్తుతం సాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ ఏడాది వర్షాలు కూడా ఆశించిన స్థాయిలో పడలేదు. చెరువుల్లోకి ఇంత వరకు చుక్క నీరు చేరలేదు. ఇలాంటి పరిస్థితిలో కృష్ణా జలాలే రైతులకు శరణ్యం. అయితే ఇంతవరకూ మడకశిర ప్రాంతానికి కృష్ణా జలాలు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం మడకశిర ప్రాంతంలోని అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపి రైతులను ఆదుకోవాలి. అగళి మైనర్ కాలువను పూర్తి చేయాలి. లేకపోతే రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడడం ఖాయం.

– ప్రశాంత్, అగళి

సర్వేలతో ఎమ్మెల్యేల హడల్

- మట్టి, ఇసుక, మద్యం దోపిడీపై ప్రశ్నలు
- దాదాపు ఎమ్మెల్యేలందరి తీరుపై సామాన్యుల మండిపాటు
- ఇద్దరు మంత్రులతో సహా 8 మందిపై తీవ్ర వ్యతిరేకత
- భయాందోళనలో ప్రజాప్రతినిధులు
- స్థానిక ఎన్నికలపై ప్రభావం పడుతుందని కేడర్ ఆందోళన



సాక్షి ప్రతినిధి, అనంతపురం: పాలన మొదలుపెట్టి ఏడాది తిరక్కుండానే టీడీపీ ఎమ్మెల్యేల్లో సర్వేల గుబులు మొదలైంది. సంవత్సరంలోనే నాలుగేళ్ల వ్యతిరేకతను మూటగట్టుకున్నట్టుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. ఓ వైపు ముఖ్యమంత్రే స్వయానా ఐవీఆర్‌ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం) ద్వారా సర్వే చేయిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం తరఫున రాబిన్ శర్మ సర్వే చేస్తున్నారని తెలుస్తోంది. ఈ రెండింట్లోనూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఇద్దరు మంత్రులతో సహా 8 మంది ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నట్టు వెల్లడైనట్లు తెలిసింది. మరికొన్ని నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దీని ప్రభావం తీవ్రంగా పడనుందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్టు ఉమ్మడి జిల్లాలో ప్రచారం జరుగుతోంది.

మెజారిటీ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 14 నియోజకవర్గాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ అభ్యర్థులే గెలిచారు. కూటమి పాలన మొదలెట్టి ఈ ఏడాది జూన్ 12 నాటికి ఏడాది దాటింది. తాజా సర్వేల ప్రకారం 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులపై వ్యతిరేకత పెల్లుబికుతోందని చర్చ జరుగుతోంది. ఐవీఆర్‌ఎస్ ద్వారా జరిగిన సర్వేలో 60 శాతం మందికి పైగా ఎమ్మెల్యేలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇద్దరు మంత్రులపైనా నిప్పులు చెరిగినట్టు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చి స్వల్పకాలమే అయినా ఎమ్మెల్యేలు, మంత్రుల వ్యవహారంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నట్టు సర్వేలు చెబుతున్నట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది.

వ్యతిరేకతకు ప్రధాన కారణాలివే..

- అన్ని నియోజకవర్గాల్లో ఉచిత ఇసుక అని చెప్పి.. ఎమ్మెల్యేలే అక్రమంగా తరలిస్తూ సామాన్యులకు అందకుండా చేస్తున్నారు.
- పలు నియోజవర్గాల్లో మట్టిని అక్రమంగా తోలుతూ సామాన్యులతో మాత్రం వేలకు వేలు వసూలు చేస్తున్నారు.
- సామాన్యులకు సంబంధించిన ఖాళీ స్థలాలు కనిపిస్తే ఎమ్మెల్యేల అనుచరులం అని చెప్పి పాగా వేసి కంచె వేస్తున్నారు. అధికారులకు చెప్పుకుంటున్నా పరిష్కారం లేదు.
- మద్యం సిండికేటు అయి పర్మిట్‌రూములు, బెల్టుషాపుల ద్వారా పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతుండటం వల్ల మహిళలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు.
- చాలామంది ఉద్యోగులు బదిలీలు, పోస్టింగ్‌ల విషయంలో సిఫార్సు లేఖలకు భారీగా వసూలు చేయడంతో ఉద్యోగ వర్గాల్లో వ్యతిరేకత వచ్చింది.
- అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపడితే మున్సిపాలిటీ అధికారులను పంపించి లక్షలకు లక్షలు వసూలు చేస్తున్నారు.

చంద్రబాబు అంటేనే మోసం



మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

గోరంట్ల (సోమందేపల్లి): ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబును మించిన నాయకుడు లేడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం గోరంట్ల మండలం రెడ్డిచెరువుపల్లి, వడిగేపల్లి, పాలసముద్రం పంచాయతీలో జరిగిన బాబు షూ్యరిటీ .. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ నవరత్నాల కార్యక్రమంలో భాగంగా జగనన్న ఇచ్చిన మాట ప్రకారం 2.70 లక్షల కోట్లను ప్రజల ఖాతాల్లోకి జమ చేశారని గుర్తు చేశారు. 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్, నిరుద్యోగ భృతి, అన్నదాన సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటికే సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని, అవన్నీ ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎవరూ అధైర్య పడొద్దని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటేష్, మేదర శంకర, జెడ్పీటీసీ సభ్యుడు జయరాంనాయక్, ఎంపీపీ ప్రమీల, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఫక్రుద్దీన సాబ్, నాయకులు జయచంద్రరెడ్డి, ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, పోతుల రామకృష్ణరెడ్డి, రఘురాంరెడ్డి, శంకర్‌నాయక్, శ్రీధర్‌రెడ్డి, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్నెవడ్రా ఆపేది?



టీడీపీ నేతలు ధ్వంసం చేసిన ఆర్‌అండ్‌బీ ప్రహరీ

- గోరంట్లలో ఆర్‌అండ్‌బీ ప్రహరీ కూల్చివేత
- టీడీపీ నాయకులపై కేసు నమోదు

గోరంట్ల (సోమందేపల్లి): అధికార అండతో టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. గోరంట్ల మండల కేంద్రంలో ఏకంగా ప్రభుత్వ ఆస్తినే ధ్వంసం చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ప్రహరీని స్థానిక టీడీపీ నాయకులు నిమ్మల యువ శేఖర్, వృషభ దేవుడుతో పాటు మరో 14 మంది జేసీబీతో గోడను కూల్చి 10 చెట్లను తొలగించారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన దినేష్, ప్రసాద్‌లకు చెందిన స్థలం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం పక్కనే ఉంది. అయితే తమ స్థలానికి గోడతో పాటు చెట్లు అడ్డుగా ఉన్నాయని వారు టీడీపీ నాయకులను ఆశ్రయించారు. తమకు డబ్బు ముట్ట చెబితే వాటిని తొలగిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా లక్షలు చేతులు మరాయి. గురువారం ప్రహరీని కూల్చి వేయడంతో ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిమ్మల యువశేఖర్, వృషభ దేవుడు, జయ, మోహన్, నరేష్, కట్ట నారాయణ, జై కృష్ణ, ప్రకాష్, ఆచారి విటలాచారి, మహేష్, మన్సూర్, గంగాధర్ టెంపో ఆదినారాయణ, రాము, దినేష్ , ప్రసాద్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి రోల్ బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి రోల్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు వద్ద ఉన్న నైరా ఎరుడైట్ ఈఎం స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ శ్వేతా తెలిపారు. చార్విక్ దేవ్ (అండర్–11), గగన్‌దీప్ (అండర్–11), ఫణి బాబు(అండర్–14), నందకిషోర్ (అండర్–14), లోచన్ (అండర్–17) ఎంపికయ్యారన్నారు. జూలై 19, 20 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రోల్ బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ శ్వేతా, ప్రిన్సిపాల్ వెంకటేష్, కోచ్ భార్గవ్ తదితరులు అభినందించారు.

బంగారు కుటుంబాలను గుర్తించండి

- కలెక్టర్ టీఎస్ చేతన్



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో పెద్ద ఎత్తున గ్రామసభలను నిర్వహించి పీ4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలను, మార్గదర్శులను గుర్తించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో పీ4 కార్యక్రమంపై బంగారు కుటుంబాలు, మార్గదర్శకులు గుర్తింపు అంశంపై ఆర్డీఓలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బంగారు కుటుంబాలను, మార్గదర్శులను గుర్తించాలన్నారు. బంగారు కుటుంబాలు ఎన్ని ఉన్నాయి? ఎన్ని అర్హతలేనివి ఉన్నాయో గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బంగారు కుటుంబాల నమోదు, తొలగింపులను జాగ్రత్తగా చేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై మానిటరింగ్ చేయాలన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సేవల విషయంలో ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ సేవలు అమలు తీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల నుంచి సానుకూలత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓలు సువర్ణ, మహేష్, ఆనంద్‌కుమార్, ఎస్ఎస్‌వీ శర్మ, సీపీఓ విజయ్ కుమార్, పరిశ్రమలశాఖ జీఎం నాగరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ శివరంగ ప్రసాద్, డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

బత్తలపల్లి: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. పుంగనూరు ఏడీఏ శివ కుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.శివన్న, వ్యవసాయాధికారి ప్రసాద్, బత్తలపల్లి ఏఓ ఓబిరెడ్డి పాల్గొన్నారు. పలు రికార్డులు, నిల్వలు పరిశీలించారు. నిల్వల్లో వ్యత్యాసమున్న రూ.3.05 లక్షల విలువైన 15.105 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేస్తూ నోటీసులు ఇచ్చారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల విక్రయాలకు సంబంధించి ప్రతి రైతుకూ తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని నిర్వాహకులను ఆదేశించారు. కాగా, విజిలెన్స్ తనిఖీలతో అప్రమత్తమైన పలువురు తమ దుకాణాలకు తాళం వేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

వ్యక్తి దుర్మరణం

గోరంట్ల (సోమందేపల్లి): వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గోరంట్ల మండలం గుంతపల్లికి చెందిన నరసింహారెడ్డి గురువారం సొంత పనిపై గోరంట్లకు వెళ్లాడు. పని ముగించుకున్న అనంతరం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన గుంతపల్లి సమీపంలోకి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనం నిలపకుండా దూసుకెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న గోరంట్ల పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

‘తమ్ముడి’ దౌర్జన్యం

- గుంతపల్లిలో పశువుల స్థలం కబ్జా
- నీటి తొట్టెను ధ్వంసం చేసి బాత్‌రూం నిర్మాణం
- గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



రహదారిని ఆక్రమించుకుని నిర్మించిన బాత్‌రూం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు గ్రామాల్లో అమాయకుల భూములతో పాటు ప్రభుత్వ భూములు, పంచాయతీ స్థలాలను కబ్జా చేయడమే పనిగా పెట్టుకున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉంది. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అండతో ‘తెలుగు తమ్ముళ్లు’ గ్రామ స్థాయి నుంచి అరాచకాలకు తెగబడుతున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. గ్రామస్తులు తిరగబడితే.. కేసులు పెట్టిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో టీడీపీ నేతల అవినీతి, అక్రమాలను ప్రజలు మౌనంగానే భరిస్తున్నారు.

పశువుల కోసం కేటాయించిన స్థలం కబ్జా..

కనగానపల్లి మండలం గుంతపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్ల క్రితం పశువుల తాగునీటి కోసమని కొంత స్థలాన్ని పంచాయతీ కేటాయించి, నీటి తొట్టెను ఏర్పాటు చేసింది. ఆ స్థలంపై కన్నేసిన స్థానిక టీడీపీ నేత నరసింహులు... తొట్టెను ధ్వంసం చేసి బాత్‌రూమ్‌ను నిర్మించాడు. ఆరంభంలోనే గుర్తించిన గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆ తర్వాత ఎంపీడీఓ గ్రామ పర్యటనకు వెళ్లిన సమయంలోనూ సమస్య వివరించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. దీంతో జిల్లా కేంద్రానికి చేరుకుని కలెక్టరేట్‌లో ప్రజా సమస్య పరిష్కార వేదికలోనూ ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ స్పందించలేదు. ఈ మూడు నెలల వ్యవధిలోనే తొట్టె మాయమై బాత్‌రూమ్ వెలసింది.

అడ్డుకునే వారు కరువు..

అధికారాన్ని అడ్డు పెట్టుకుని టీడీపీ నేతలు కబ్జాలకు పాల్పడుతున్నా అడిగే వారు ఎవరూ లేకుండా పోయారు. అడ్డుకోవాల్సిన అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. గ్రామస్తులు ఎవరయినా అభ్యంతరం వ్యక్తం చేస్తే.. అధికారంలో ఉన్నామని.. కేసుల్లో ఇరికించి జైలు పాలు చేస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే రెండు, మూడు సార్లు పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పించారని గ్రామానికి చెందిన కొందరు వాపోయారు. తాగునీటి తొట్టె సంగతిని ఎవరూ పట్టించుకోకపోతే భవిష్యత్తులో గ్రామంలోని మిగులు పంచాయతీ స్థలాలను కబ్జా చేసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరంభంలోనే ఇలాంటి దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దిక్కు లేకుండా పోయింది



మా ఊరి పంచాయతీ స్థలంలో చాలా ఏళ్ల క్రితం పశువుల కోసం తాగునీటి తొట్టె నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ తొట్టెను తొలగించి.. పక్కనే నివాసం ఉంటున్న నరసింహులు ఆక్రమించి తన స్వప్రయోజనాలకు వినియోగించేందుకు రూమ్ నిర్మించాడు. మొదట్లోనే ఈ విషయాన్ని అధికారులకు తెలియజేశాం. ఎంపీడీఓ వచ్చి బాత్‌రూమ్ కట్టడాలను అడ్డుకుని తిరిగి తాగునీటి తొట్టె నిర్మిస్తామని చెప్పారు. అయితే ఆ తర్వాత గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. టీడీపీ బడానేతల అండతో అధికారులను గ్రామంలోకి రానీవ్వకుండా చేసి నిర్మాణం పూర్తి చేశాడు. ప్రస్తుతం ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందిగా ఉంది.

– బయపురెడ్డి, గుంతపల్లి, కనగానపల్లి మండలం

నేడు రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక వర్గం ఎన్నికలు



గుంతకల్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక మండలి ఎన్నికలు శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు సీనియర్ డీపీఓ కోర్డినేషన్ హెచ్ఎల్ఎన్ ప్రసాద్ గురువారం వెల్లడించారు. రెండేళ్ల కాల వ్యవధి ఉన్న రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక మండలికి నిర్వహించే ఈ ఎన్నికల్లో కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారితో పాటు ఆరుగురు సభ్యులను రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నుకోనున్నారు. గుంతకల్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో మొత్తం 943 మంది ఓటర్లు ఉన్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు రైల్వే ఇన్‌స్టిట్యూట్ పోలింగ్ ప్రక్రియ ఉంటుంది. అనంతరం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి, వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. కాగా, ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ మజ్దూరు యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ మధ్యనే ఉంది. మజ్దూర్ యూనియన్ తరఫున కార్యదర్శిగా కె.యల్లప్ప, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఎస్.సతానియల్‌తో పాటు ఆరుగురు కమిటీ సభ్యులుగా పోటీ చేస్తున్నారు. ఎంప్లాయీస్ సంఘ్ తరఫున కార్యదర్శిగా మల్లికార్జున, సంయుక్త కార్యదర్శిగా షెక్షావలి, కోశాధికారిగా నాగరాజుతోపాటు ఆరుగురు కమిటీ సభ్యులుగా బరిలో నిలిచారు. కాగా డివిజన్ వ్యాప్తంగా ఇప్పటి వరకూ జరిగిన రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ హవా కొనసాగింది. పాకాల రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో యూనియన్ 6 పోస్టులు, సంఘ్ 3 పోస్టులు కైవసం చేసుకుంది. ఇక రేణిగుంట, నందలూరు, కడప ఇన్‌స్టిట్యూట్ పాలక మండళ్లను మజ్దూర్ యూనియన్ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. గుత్తి రైల్వేఇన్‌స్టిట్యూట్‌లో క్లీన్ స్వీప్ చేసింది.

‘ఎంటుఎం’ యూట్యూబర్‌పై కేసు నమోదు

కదిరి అర్బన్: పాత్రికేయ వృత్తిని కించపరిచేలా వ్యవహరించారనే ఫిర్యాదుతో ఎంటుఎం యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు సుధాకర్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కదిరి సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను గురువారం రాత్రి ఆయన వెల్లడించారు. విలేకరులకు ఇంటి పట్టాలపై మంజూరు విషయంగా కొన్ని రోజుల క్రితం కదిరిలో ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ అంశంపై ‘రాయలసీమలో ఒక ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం... మీడియాను గుప్పిట్లో పెట్టుకోవడానికేనా?’ అంటూ ఓ కథనాన్ని హైదరాబాద్‌కు చెందిన ఎంటుఎం యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు సుధాకర్ పోస్టు చేశాడు. ఈ కథనం ప్రతికా విలేకరుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందని, ఇందుకు బాధ్యులైన సుధాకర్‌తో పాటు అదే చానల్ అనంతపురం ప్రతినిధి వినోద్‌కుమార్, కదిరి వేమా న్యూస్ యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు వేమ ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు కదిరికి చెందిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ సోమశేఖరనాయుడు ఫిర్యాదు చేశాడు. దీంతో ముగ్గురిపై 356 యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ



బాధితురాలిని విచారిస్తున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: స్థానిక హనుమేష్‌నగర్ ఎల్ఐసీ కార్యాలయం గురువారం రాత్రి చైన్‌స్నాచింగ్ జరిగింది. తన సోదరి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న మల్లీశ్వరి అనే మహిళ మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును దుండగుడు లాక్కొని ఉడాయించాడు. బాధితురాలు తెలిపిన మేరకు.. మల్లీశ్వరి కర్నూలు జిల్లా మద్దికెర సుబ్రమణ్యస్వామి ఆలయంలో పనిచేస్తోంది. పనిపై తన ఇంటి నుంచి పక్క వీధిలో ఉంటున్న తన అక్క సులోచన ఇంటికి గురువారం రాత్రి నడుచుకుంటూ వెళుతుండగా బైక్‌పై వచ్చిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని ఉడాయించాడు. ఈ ఘటనతో ఆమె మెడపై గాయమైంది. గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమెను విచారించారు. చుట్టుపక్కల గాలించినా దుండగుడి ఆచూకీ లభ్యం కాలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండండి : డీఎస్పీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి అర్బన్: చోరీలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొబేషనరీ డీఎస్పీ ఉదయపావనితో కలసి ఆయన మాట్లాడారు. జిల్లాలో మధ్యప్రదేశ్ చెందిన చెడ్డీ, పార్థీ, బిళ్లా గ్యాంగ్‌లతో పాటు నంద్యాలకు చెందిన చెంచు జాతి దొంగల సంచారం ఎక్కువగా ఉందన్నారు. ఈ ముఠాలు జిల్లాలోని పుట్టపర్తి, గాండ్లపెంట, ధర్మవరం, రాప్తాడు, తిరుపతి, కర్ణాటకలోని గౌరీబిదనూర్‌లో చోరీలకు పాల్పడ్డాయన్నారు. వీరు రాత్రి 12 నుంచి 3 గంటల మధ్య విశాలమైన పెద్ద ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతుంటారన్నారు. కదిరిలోని ఎన్‌జీఓ కాలనీ, వాణి స్ట్రీట్, మగ్గాల క్వార్టర్స్, సైదాపురం, వైఎస్సార్ నగర్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చోరీలను అరికట్టేందుకు రాత్రి గస్తీలు ముమ్మరం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు కూడా ఇందుకు సహకరించాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తుల సంచారం ఉంటే డయల్ 100, టౌన్ సీఐ 94407 96851 కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం పెట్రోలింగ్ కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మూడు ద్విచక్ర వాహనాలను ప్రారంభించారు.

కర్నూలులో హాస్పిటల్‌పై పామిడి వాసుల దాడి





మృతి చెందిన అనిత, మృతురాలి కుటుంబీకుల దాడిలో ధ్వంసమైన ఆసుపత్రిలోని కిటికీలు, తలుపులు

- యువతి మృతితో కుటుంబ సభ్యుల ఆందోళన
- ఆస్పత్రి అద్దాల ధ్వంసం

కర్నూలు(హాస్పిటల్): జ్వరం కారణంగా చికిత్సకు వచ్చి యువతి మృతి చెందడంతో ఆమె కుటుంబసభ్యులు గురువారం కర్నూలులోని శ్రీ చక్ర హాస్పిటల్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆస్పత్రిపై దాడి చేసి గాజు కిటికీలు, తలుపులు ధ్వంసం చేశారు. వంద మందికి పైగా నిర్వహించిన ఈ దాడితో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. వివరాలు... అనంతపురం జిల్లా పామిడికి చెందిన అనిత(21)కు కర్నూలులోని కల్లూరు ఎస్టేట్ పోలీస్ కాలనీకి చెందిన ప్లాట్ల రమణ కుమారుడు నాగేంద్రతో ఏడాది క్రితం వివాహమైంది. తండ్రితో కలిసి నాగేంద్ర రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనితకు ఈ నెల 15న జ్వరం రావడంతో సమీపంలో ఉన్న శ్రీచక్ర హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి క్యాజువాలిటీలో ఆమెకు అవసరమైన చికిత్సను అందించి సాయంత్రం ఇంటికి పంపించారు. మరుసటి రోజు బుధవారం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు. కాగా, గురువారం ఉదయం పామిడి నుంచి వచ్చిన అనిత కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో శ్రీచక్ర హాస్పిటల్ వద్దకు చేరుకున్నారు. అనితకు సకాలంలో వైద్యం అందించలేదని, మెరుగైన వైద్యం అందించి ఉంటే బతికేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆందోళన ప్రారంభించారు. ఈ ఆందోళన క్రమంగా ఉద్రిక్తతకు దారి తీసింది. ఒక దశలో ఆస్పత్రిపై రాళ్లు విసిరి అద్దాలు పగులగొట్టారు. బయట ఉన్న మెడికల్‌షాపు అద్దాన్ని, గాజు తలుపును ధ్వంసం చేశారు. ఆస్పత్రిలోకి చొరబడి కనిపించిన ప్రతి వస్తువునూ ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో క్యాజువాలిటీ, ఆరోగ్యశ్రీ కియోస్క్, కిటికీలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు రామయ్య యాదవ్, నాగరాజురావు, శేషయ్య, విక్రమసింహ, తబ్రేజ్, సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనిత మృతితో సంబంధం లేదు..

అనిత మృతికి ఆస్పత్రికి ఎలాంటి సంబంధం లేదని శ్రీచక్ర హాస్పిటల్ అధినేత డాక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనిత అనే యువతి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జ్వరంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం వచ్చిందన్నారు. క్యాజువాలిటీలోనే సాయంత్రం వరకు ఆమెకు అవసరమైన మందులు ఇచ్చి, ఫ్లూయిడ్స్ పెట్టామన్నారు. ఆమె కోలుకోవడంతో ఇంటికి వెళ్తానంటే పంపించామన్నారు. మరుసటి రోజు రాత్రి అత్యవసర పరిస్థితిలో కుటుంబసభ్యులు ఆమెను క్యాజువాలిటీకి తీసుకొచ్చారని, అప్పటికే ఆమె మృతి చెంది ఉందన్నారు. ఆమె మృతికి, ఆస్పత్రికి ఎలాంటి సంబంధం లేదని, అయినా ఆస్పత్రిపై దాడి చేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిపై తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఈ ఘటనపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామచంద్రనాయుడు, డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, డాక్టర్ బాలమద్దయ్య, ప్రైవేటు ఆసుపత్రుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో చోటు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చెందిన రాష్ట్ర అనుబంధ విభాగాల్లో జిల్లాలో పలువురికి చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎస్. అమీర్‌బాషా (ధర్మవరం), సెక్రటరీగా డి.సోముశేఖర్‌రెడ్డి (పుట్టపర్తి), జాయింట్ సెక్రటరీగా వై.సాయినాథ్‌రెడ్డి (పుట్టపర్తి), బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పి. రామాంజనేయులు (ధర్మవరం) నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

చెరువులో పడి వ్యక్తి మృతి

అమరాపురం: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. వివరాలు.. గురువారం ఉదయం అమరాపురం చెరువులో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఇషాక్‌బాషా, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించారు. నాలుగు రోజుల క్రితం చెరువులో పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని విధంగా మారింది. దీంతో తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సాయంత్రం అమరాపురానికి చెందిన జాహేదా తన సోదరుడు షుక్లేన్ (58) నాలుగు రోజులుగా కనిపించడం లేదంటూ పోలీసులను ఆశ్రయించడంతో మృతదేహాన్ని చూపించారు. దీంతో మృతుడిని షుక్లేన్‌గా ఆమె నిర్ధారించారు. మూర్ఛవ్యాధితో బాధపడుతున్న తన సోదరుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉంటాడంటూ జాహేదా చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లేపాక్షిలో కేంద్ర బృందం పర్యటన



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

లేపాక్షి: స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్–2025లో భాగంగా కేంద్ర బృందం సభ్యులు రామాంజనేయులు, అనంత్ గురువారం లేపాక్షిలో పర్యటించారు. మురుగునీటి కాలువలు, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. చెత్తను బయట వేయరాదని, ప్లాస్టిక్ వాడరాదని, స్వచ్ఛమైన నీరు సేవించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ

మడకశిర: స్థానిక పావగడ రోడ్డులోని రెండు ఇళ్లలో పట్టపగలే చోరీ జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నివాసముంటున్న కొలిమి నాగేంద్ర గురువారం ఉదయం 11గంటల సమయంలో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి పనిపై బ్యాంకుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని ఇంటికి వచ్చేలోపు తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.70 వేల నగదు, జత బంగారు కమ్మలు, ఓ ఉంగరం అపహరించినట్లుగా గుర్తించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

- నాగేంద్ర ఇంటి పక్కనే మేడపై నివాసముంటున్న శకుంతల ఇంట్లోనూ చోరీ జరిగింది. పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో పనిచేస్తున్న ఆమె గురువారం ఉదయం 7 గంటలకు ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లిపోయారు. ఆ సమయంలో ఇంట్లోకి చొరబడిన దుండగులు వస్తువులను చెల్లాచెదురు చేసి బంగారు నగలు అపహరించారు. కాగా, ఇంటి యజమానురాలు వచ్చి ఎంత మేర సొత్తు చోరీ అయింది నిర్ధారించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఇప్పటికే నాగేంద్ర ఫిర్యాదు స్వీకరించామని, శకుంతల వచ్చిన తర్వాత ఆమె నుంచి ఫిర్యాదు తీసుకుని కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని సీఐ నగేష్‌బాబు తెలిపారు. క్లూస్‌టీంను రంగంలో దించి దొంగల వేలి ముద్రలను సేకరించినట్లు తెలిపారు.

వేధింపులపై యువతి ఫిర్యాదు

ధర్మవరం రూరల్: తనను ధర్మవరం మండలం తుంపర్తి గ్రామానికి చెందిన ప్రణవ్ అనే యువకుడు వేధిస్తున్నాడంటూ పోలీసులకు ఓ యువతి ఫిర్యాదు చేసింది. వివరాలు.. ధర్మవరం పట్టణంలోని శివానగర్‌కు చెందిన ఓ యువతి బీటెక్ పూర్తి చేసి, పోటీ పరీక్షలకు హైదరాబాద్‌లోని కోచింగ్ తీసుకుంటోంది. అక్కడే తన స్నేహితురాలి పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు ప్రణవ్ పరిచయమయ్యాడు. అనంతరం తరచూ ఫోన్ చేస్తుండేవాడు. ఆమె ఉంటున్న హాస్టల్ వద్దకూ వెళుతుండేవాడు. ఈ క్రమంలో తాను ప్రేమిస్తున్నానంటూ వెంట పడుతూ అసభ్యంగా మాట్లాడడం మొదలు పెట్టాడు. తనకు అలాంటి ఉద్దేశం లేదని చెప్పినా వినకుండా వెంటపడేవాడు. వారం రోజుల క్రితం యువతి హైదరాబాద్ నుంచి ధర్మవరానికి చేరుకుంది. అయిన ప్రణవ్ వదలకుండా ఇతరుల ఫోన్ నుంచి కాల్స్ చేయడంతో పాటు అసభ్యంగా మెసేజ్‌లు పెడుతూ వచ్చాడు. తాను చెప్పినట్లుగా నడుచుకోకపోతే హతమారుస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపి వారి సమక్షంలో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ధర్మవరం రెండో పట్టణ పోలీసులు తెలిపారు.


వ్యాధుల నియంత్రణలో పురోగతి




మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి

హిందూపురం: సీజనల్, అంటువ్యాధుల నియంత్రణలో వంద శాతం పురోగతి సాధించినట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలపై పెనుకొండ డివిజన్‌లోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులతో గురువారం ఆమె సమీక్షించారు. పీహెచ్‌సిలోని వైద్య సదుపాయలు, రోగులకు అందించిన సేవలు, పిల్లల ఆరోగ్య పరిస్థితి, రెగ్యులర్ హాస్టల్ విజిట్స్‌పై ఆరా తీశారు. ప్రమాదకరమైన వ్యాధులు, క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లయితే హయ్యర్ సెంటర్స్‌కు రెఫర్ చేయాలని సూచించారు.


ఆంధ్రా క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కు ఆరుగురి ఎంపిక



మచ్చా కె.దత్తారెడ్డి



అర్జున్ టెండూల్కర్



మల్లికార్జున



కమిల్



దీపక్



మహేంద్రరెడ్డి

అనంతపురం: ఆంధ్రా అండర్–23 క్రికెట్ జట్టు ప్రాబబుల్స్ ఎంపిక గురువారం ముగిసింది. అనంతపురానికి చెందిన ఆరుగురికి చోటు దక్కింది. వీరిలో మచ్చా కె.దత్తారెడ్డి, పి.అర్జున్ టెండూల్కర్, జి.మల్లికార్జున, ఎస్.మహమ్మద్ కమిల్, టి. హేంద్ర రెడ్డి, ఎం.దీపక్ ఉన్నారు. మచ్చా దత్తారెడ్డి కుడిచేతి ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా రాణిస్తున్నాడు. ఆంధ్ర అండర్ 23 రంజీ టోర్నీలో ప్రతిభ చాటాడు. అలాగే కుడిచేతి ఓపెనర్‌గా, ఆఫ్ స్పిన్నర్‌గా రాణిస్తున్న పి.అర్జున్ టెండూల్కర్ ఇప్పటికే ఆంధ్ర అండర్ 23, 19 జట్లలో ప్రాతినిధ్యం వహించారు. ఎడమ చేతి వాటం స్పిన్నర్ అయిన మల్లికార్జునకు అంతర జిల్లా మ్యాచ్‌ల్లో పది వికెట్లు తీసిన రికార్డు ఉంది. అలాగే ఎడమ చేతి మీడియ పేస్ బౌలర్ దీపక్ సైతం అంతర్ జిల్లా మ్యాచ్‌లో 11 వికెట్లు సాధించి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. కమిల్ ఎడమ చేతి స్పిన్నర్. ఎడమ చేతి వాటం మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరుస్తున్నాడు. మహేంద్ర రెడ్డి కుడిచేతి వాటం మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్. అండర్–19, అండర్–23 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీ, మరో అర్ధ సెంచరీ సాధించాడు.